

ఉష్ణోగ్రత


నగరం	గరిష్ట	కనిష్ట:
రాజమహేంద్రవరం	41.0	26.5
కాకినాడ	37.5	27.4
అమలాపురం	39.0	27.0



ఆకస్మిక తనిఖీ

రామచంద్రపురం: రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ మంగళవారం పట్టణంలోని పలు షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండీయూ వాహనాలను పరిశీలించారు.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం సాయంత్రం 3,544 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. తాగునీటి అవసరాలకు పశ్చిమ డెల్టా కాలువలకు 500 క్యూసెక్కుల నీరు వదిలారు.

న్యూస్‌రీల్

నేడు పాలిసెట్ ప్రవేశపరీక్ష

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో చేరేందుకు బుధవారం పాలిసెట్–2023 నిర్వహించనున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. 14 కేంద్రాల్లో 5,677 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రానికి గంట ముందు హాజరుకావాలన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టిక్కెట్‌తో పాటు బాల్‌పాయింట్ పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరైజర్, రబ్బరు, ప్యాడ్ మాత్రమే తెచ్చుకోవాలన్నారు. సెల్, కాలిక్యులేటర్, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించరన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం గైట్ ఇంజినీరింగ్ కళాశాలలోకి వెళ్లేందుకు గేటు వద్ద, పాలచర్ల బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలకు వెళ్లేందుకు దివాన్‌చెరువుసెంటర్‌లోను, భూపాలపట్నం రైట్ ఇంజినీరింగ్ కళాశాలకు మోరంపూడి జంక్షన్‌లోనూ, కొండగుంటూరులోని సత్యశ్రీ పరిమళ పాలిటెక్నిక్‌కు బొమ్మూరు సెంటర్‌లో బస్సులను ఏర్పాటు చేసినట్టు ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు వ్యవసాయ మంత్రి గోవర్ధనరెడ్డి పర్యటన



కాకాని గోవర్ధనరెడ్డి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి కాకాని గోవర్ధరెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. గుంటూరు నుంచి బయలుదేరి ఉదయం 10.30 గంటలకు రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుంటారు. 10.45 గంటల నుంచి 11.15 వరకూ శ్యామలా సెంటర్‌లో జిల్లా సహకార కేంద్రబ్యాంకు బ్రాంచి భవనానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం లాలాచెరువులోని రైతుబజార్‌ను, కాతేరులో వ్యవసాయ కళాశాల భవన సముదాయాలను ప్రారంభిస్తారు. తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా అలంపురం బయలుదేరతారు.

వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కొవ్వూరు: జాతీయ స్థాయిలో నిర్వహించే సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆర్ట్స్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈనెల 14న జరగనుంది. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి జీవీ పవన్‌కుమార్ ఈ విషయం తెలిపారు. ఈనెల 27 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు సబ్ జూనియర్ బాల, బాలికల పోటీలు పశ్చిమ బెంగాల్‌లో నిర్వహిస్తారన్నారు.

ఇక్కడ రాష్ట్ర స్థాయిలో బాల, బాలికల జట్లు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఉన్న జిల్లా స్థాయి క్రీడాకారుల నుంచి ఈ నెల 11న భీమవరంలో డీఎన్‌ఆర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం మూడు గంటలకు బాల, బాలికల జిల్లా జట్లుని ఎంపిక చేస్తారన్నారు. క్రీడాకారులు 2007 జనవరి ఒకటో తేదీ తర్వాత పుట్టిన వారై ఉండాలన్నారు. జన్మ ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు. వివరాలకు 97041 02444, 63035 78996, 98669 38122 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

లోక్ అదాలత్‌పై అధికారులతో జిల్లా జడ్జి భేటీ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఈనెల 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్ నేపథ్యంలో ఇన్సూరెన్స్ కంపెనీలు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు, న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మంగళవారం సమావేశమయ్యారు. లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో మోటారుసైకిల్ ప్రమాదాల కేసులను పరిష్కరించేందుకు ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి, బార్ కౌన్సిల్ అధ్యక్షుడు జీయూవీబీ రాజు పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం సేకరణ

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో మంగళవారం నాటికి 26,280 మంది రైతుల నుంచి 1,78,590.210 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు కూపన్లను అందజేసినట్లు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ లలో 15,899 రైతుల నుంచి 1,45,499.318 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు చేసిన వారం రోజులలోపే 4,776 ఎఫ్‌టీఓలకు రూ. 65.33 కోట్లను రైతు బ్యాంకు ఖాతాకు జమ చేశామన్నారు.

వారం తిరగకుండా సొమ్ము వేశారు



నేను 1.83 ఎకరాలు వరి సాగుచేశాను. వర్షాలతో పంట తడిసి ముద్దయ్యింది. అయోమయంలో ఉండగా ప్రభుత్వ అధికారులు వచ్చి తడిసిన ధాన్యం కొనుగోలు చేయడంతో ప్రాణం లేచి వచ్చింది. గోనెసంచులు కూడా తీసుకువచ్చి ట్రాక్టర్లపై తరలించారు. వారం తిరగకుండానే ఈ నెల 4న రూ.1.38 లక్షలు బ్యాంక్ ఖాతాలో జమ అయ్యింది. ప్రభుత్వం సమయానుకూలంగా స్పందించి ఆదుకుంది.

– బుద్దాల లక్ష్మణరావు. జగన్నాథపురం. నల్లజర్ల మండలం.

'ఏ ప్రభుత్వం ఇలా కొనలేదు'



నేను 16.8 ఎకరాలు కౌలుకు సాగు చేశాను. వర్షంలో కూడాధాన్యం సేకరిస్తామని అధికారులు కళ్ళాల్లోకి వచ్చి చెప్పారు. గతంలో ఎవరకూ ఇలా ధైర్యం చెప్పలేదు. ప్రాణం లేచి వచ్చింది. ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలకు విక్రయించిన ఆరు రోజుల్లోనే రూ.12.89లక్షలు బ్యాంక్ ఖాతాలో జమ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.1530లకే ధాన్యం కొనడమే కాకుండా ఊహించని రీతిలో డబ్బులు అకౌంట్‌లో వేయడంసంతృప్తినిచ్చింది.

– బి వీరవెంకటసత్యనారాయణ. కడియం

తొమ్మిది రోజుల్లోనే ఖాతాలో సొమ్ములేశారు



రబీలో రెండున్నర ఎకరాలు వరి సాగుచేశాను. రైతు భరోసా కేంద్రానికి ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించిన తొమ్మిది రోజులకే రూ.1.90 లక్షలు బ్యాంక్ ఖాతాలో పడ్డాయి. ప్రభుత్వం సమయానికి ఆదుకోవడంతో నష్టపోకుండా గట్టెక్కాను.

– పేరిచెర్ల వెంకటనరసింహరాజు, రాజులపాలెం, పి గన్నవరం మండలం.

దైన్యాన్ని తరిమి.. ధైర్యాన్ని నింపి..

సర్కారు స్పందన.. తొలగిన వేదన

- రబీ రైతును గట్టెక్కిస్తోన్న ప్రభుత్వం
- తడిసిన ధాన్యం వడివడిగా కొనుగోలు
- పది రోజుల్లోనే ఖాతాలకు నగదు
- వాస్తవాలు పట్టకుండా విపక్ష నేతల విమర్శల బురద



పి.గన్నవరం మండలం రాజులపాలెంలో ఎండరావడంతో ధాన్యాన్ని దగ్గరుండి పట్టుబడి పట్టిస్తున్న కొత్తపేట ఆర్డీవో ముక్కంటి, తహసీల్దార్ రవీంద్రనాథ్‌ఠాగూర్

సాక్షిప్రతినిధి, కాకినాడ: అకాల వర్షాల ఇబ్బందుల నుంచి రైతుల్ని గట్టెక్కించడంలో రాష్ట్ర ప్రభుత్వం సఫలీకృతమైంది. గడచిన వారం రోజులుగా అధికార యంత్రాంగం నిరంతరం క్షేత్రస్థాయిలో విస్తృతంగా తిరుగుతూ తడిసిన ధాన్యం కొనుగోలులో తలమునకలైంది. తడిసిన ధాన్యం ముక్కిపోయినా నిబంధనలు సడలించి కొనుగోలు చేసేలా చూస్తోంది. ధాన్యాన్ని కళ్లాల నుంచి తరలించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంది. నిధులకు వెనుకాడకుండా ప్రత్యేకంగా ట్రాక్టర్లను వినియోగిస్తోంది. పాడి ప్రాంతాలు, రైతు భరోసా కేంద్రాలకు తరలించి ధైర్యాన్ని నింపింది. ఇటీవల వర్షాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని పల్లపు ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. రైతుల ఆవేదన అధికారుల ద్వారా తెలుసుకున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సమయానుకూలంగా స్పందించారు. తడిసిన ధాన్యం తరలింపు నుంచి కొనుగోలు వరకు నిశిత దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాలలో మద్దతు ధరకు కొని 10 రోజుల్లోనే రైతు ఖాతాకు జమ చేస్తున్నారు.

ట్రాక్టర్ల ద్వారా తరలింపు

కోనసీమలో 1,113 ఎకరాలు ముంపునకు గురవ్వగా అధికారులు చొరవ తీసుకున్నారు. వర్షపు నీటిని బయటకు తోడించి ముంపు నుంచి కాపాడారు. ముంపు బారిన పడ్డ 2,300 ఎకరాలకు సంబంధించి జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలను వినియోగించి రైతులకు భరోసా కల్పించారు. పొలాల్లో 1,800 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు దగ్గరుండి ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించారు. రవాణాకు సుమారు రూ.50 లక్షలు వెచ్చించారు. కళ్లాల్లో ఉన్న 23,279 మెట్రిక్ టన్నులను సంచుల్లో నింపి సమీప రైసుమిల్లులకు తరలించారు. దీనిపై రైతుల నుంచి సంతోషం వ్యక్తమవుతోంది.

తూర్పుగోదావరి జిల్లా..

సేకరించిన ధాన్యం : 143731.400 (మెట్రిక్‌టన్నుల్లో)

రైతులు : 15899

మొత్తం ఎఫ్.టి.ఓ.లు : 23391

ధాన్యం విలువ : రూ.292.51 (కోట్లలో)

రైతుల ఖాతాలకు జమ : రూ.65.33 (కోట్లలో)

అధికారులు ధైర్యం ఇచ్చారు



మాది నల్లజర్ల మండలం చోడవరం వెస్ట్. 5.70 ఎకరాలు వరి సాగు చేశాను. ధాన్యం కోత కోసి ఒడ్డుకు చేర్చిన తరువాత తడిసింది. ఇంతలో మండల అధికారులు కళ్లానికి వచ్చారు. ధాన్యం చూసి ధైర్యం చెప్పారు. రైతుభరోసా కేంద్రానికి తరలించారు. కొనుగోలుచేసిన ఎనిమిదో రోజున ఖాతాలో రూ.6.60 లక్షలు జమ అయ్యింది. రబీలో గట్టెక్కానని ఊపిరిపీల్చుకున్నాను.

– పిచ్చుకల బదరీనాథ్.చోడవరం వెస్ట్, నల్లజర్ల మండలం.

ప్రభుత్వం అండగా నిలిచింది



నేను 8 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేసాను. వర్షాల్లో ధాన్యం తడిసిపోయాయి. నష్టాల పాలవుతానని భయపడ్డాను. ప్రభుత్వం తడిసిన రంగు మారిన ధాన్యం కొనుగోలు చేస్తామనడంతో వ్యవసాయ శాఖ ఏడీఏ స్వాతి వచ్చి ధాన్యం కొనుగోలు చేసారు. 120 క్వింటాళ్లు ధాన్యం అమ్మాను.కనీస మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేశారు.

– సారేపల్లి సూర్యప్రకాష్,చిత్రాడ. పిఠాపురం.

బురద చల్లేందుకు నిన్న బాబు.. నేడు పవన్

ప్రభుత్వం సకాలంలో స్పందించి ఆదుకుంటుంటే ప్రతిపక్ష నేతలు స్వార్థ రాజకీయంతో బురదజల్లుతున్నారని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు ఆక్షేపిస్తున్నారు. మూడు రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు రైతుల పరామర్శ పేరుతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించారు. రైతుల నుంచి ఆయన పర్యటనకు స్పందన కొరవడింది. దీంతో చంద్రబాబు తీవ్ర అసహనం వ్యక్తం చేయడం కనిపించింది. ఆయన వెళ్లగానే జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఉమ్మడి తూర్పులో పర్యటనకు బుధవారం వస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి కడియం ఆవ భూముల మీదుగా కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. పవన్ పర్యటించే రెండు జిల్లాల్లోనూ వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడమే కాకుండా పది రోజుల్లోపే రైతుల ఖాతాలకు సొమ్ములను కూడా జమ చేసింది. వాస్తవాలను పక్కకు నెట్టి ప్రభుత్వంపై విమర్శలు చేయడం కోసమే విపక్ష నాయకులు పర్యటించడంపై రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

'జగనన్నకు చెబుతాం'తో మరింత బాధ్యత



వీసీలో పాల్గొన్న కలెక్టర్ మాధవీలత, ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి, జేసీ తేజ్‌భరత్, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి

- 1902కి వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం
- కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జగనన్నకు చెబుదాం (జేకేసీ) కార్యక్రమం ద్వారా ప్రజల అర్జీల పరిష్కార విధానంలో మనపై మరింత బాధ్యత పెరిగిందని కలెక్టర్ మాధవీలత అన్నారు. తాడేపల్లిలోని సీఎం విడిది కార్యాలయం నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్, ఎస్పీ, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పుడు జేకేసీ కార్యక్రమానికి 'జగనన్న' పేరు ఉండడంతో మనపై మరింత బాధ్యతతో పాటుగా జవాబుదారీతనం కూడా పెరిగిందన్నారు. 1902కి వచ్చే ఫిర్యాదుల విషయంలో అత్యంత శ్రద్ధ చూపాలన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాల్సి ఉందన్నారు. జిల్లాస్థాయిలోనే కాకుండా క్షేత్ర, గ్రామ స్థాయి వరకూ ప్రజల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయడం ముఖ్యమన్నారు. ఈ మేరకు జిల్లా, డివిజన్, మండల మండల కేంద్రాల్లో మానిటరింగ్ యూనిట్లు ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో జిల్లా ఎస్పీ సీహెచ్ సుధీర్ కుమార్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్, డీఆర్వో జె.నరసింహులు, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు.

హజ్ యాత్రికులూ అపోహలు వద్దొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న హబీబుల్లా బేగ్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): హజ్‌యాత్రకు సంబంధించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, యాత్రికులు ఎటువంటి అపోహలకు గురికావద్దని గోదావరి హజ్ సొసైటీ ప్రెసిడెంట్ ఎండీ హబీబుల్లా బేగ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడారు. హజ్‌యాత్రకు ఒక్కొక్కరికి రూ.60 వేలు వంతునరాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. యాత్రకు హైదరాబాద్ నుంచి వెళితే ఖర్చులు తగ్గుతాయనుకుంటే రాష్ట్ర ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వ ఖాజీ మౌలానా కరీముల్లా మాట్లాడుతూ ఇటీవల సామాజిక మాధ్యమాల ద్వారా హజ్ యాత్రకు సంబంధించి యాత్రికులను గందరగోళపరిచేలా సమాచారం వస్తున్నందున ప్రభుత్వ పరంగా ముస్లింలకు వాస్తవాలు వివరిస్తున్నామన్నారు. యాత్రికులకు ఏవైనా సందేహాలు ఉంటే గోదావరి హజ్ సొసైటీ అధ్యక్షుడు హబీబుల్లా బేగ్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. సమావేశంలో ఎండీ అమానుల్లా బేగ్, సయ్యద్ సమీ, ఎండీ ఇమ్రాన్, ఎండీ నసీరుల్లా బేగ్ పాల్గొన్నారు.

పేదల పెళ్లిళ్లకు ప్రభుత్వ భరోసా



వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా చెక్కుని లబ్ధిదారులకు అందజేస్తున్న హోం మంత్రి వనిత

రాష్ట్ర హోం మంత్రి వనిత

కొవ్వూరు: పేద కుటుంబాల్లో పెళ్లిళ్లు చేయడం భారంగా మారకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల ఆడపిల్లల వివాహాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పేరుతో సాయం అందిస్తోందని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ కల్యాణ మస్తు, షాదీ తోఫా ద్వారా 522 పెళ్లిళ్లకు రూ.3,82,70,000 సాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. ఈ సొమ్మును ఆయా తల్లుల ఖాతాల్లోకే నేరుగా ప్రభుత్వం జమ చేస్తుందన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో రెండో విడత కింద కల్యాణమస్తు ద్వారా 68 మందికి రూ.57.20లక్షల చెక్కును మంత్రి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. కనీస అర్హత పదో తరగతిగా నిర్ణయించడం ద్వారా ఆడపిల్లల విద్యకు తల్లిదండ్రులు ప్రాధాన్యం ఇస్తారన్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారిత సాధించాలన్న లక్ష్యంతో కులాంతర వివాహాలు చేసుకున్న వధూవరులకు, అదే కులంలో వివాహాలు చేసుకున్న వారికి తల్లుల ఖాతాల్లో కల్యాణమస్తు సాయం జమ చేస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. డీఆర్‌డీఏ పీడీ సుభాషిణి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల వివాహానికి జంటకి రూ.1లక్ష చొప్పున, కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షల చొప్పున, బీసీలకు రూ.50 వేల చొప్పున సాయం అందజేస్తున్నట్లు ప్రకటించారు. బీసీల్లో కులాంతర వివాహం చేసుకున్నవారికి రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు, రిజిస్టర్ అయిన భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ డీపీఎం డీకే మారుతి, ఎంపీపీలు మాట్టా వీరాస్వామి, జొన్నకూటి పోసిబాబు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, అక్షయ పాత్ర శ్రీనివాస రవీంద్ర, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, తాళ్లపూడి, చాగల్లు మండల పార్టీ అధ్యక్షులు కాకర్ల వెంకటేశ్వరరావు, చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు, నక్కా చిట్టిబాబు, బత్తి నాగరాజు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్, వైస్ ఎంపీపీ వీరమళ్ల నారాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటికి వ్యవసాయ కళాశాల

నేడు ప్రారంభించనున్న మంత్రి గోవర్ధనరెడ్డి



కాతేరులోని వ్యవసాయ కళాశాల నూతన భవనం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాలకు సొంత భవనం సమకూరింది. దాదాపు 14 ఏళ్లు పరాయి పంచన విద్యాభ్యాసం కొనసాగిన తర్వాత ప్రభుత్వ చొరవతో కల సాకారమైంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గోదావరి జిల్లాల రైతులకు కలల సాకారం చేసేందుకు రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాలలో 2008 నవంబర్ 5న 24 మంది విద్యార్థులతో వ్యవసాయ కళాశాల ప్రారంభమైంది. వ్యవసాయ విద్యపై మక్కువ, విద్యార్థుల సంఖ్య పెరగడంతో ఆర్ట్స్ కళాశాలలో ఇచ్చిన గదులతో వ్యవసాయ విద్యా బోధనకు ఇబ్బందిగా ఉండేది. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల చొరవతో కందుకూరి వీరేశలింగం ఆస్తిక కళాశాల ప్రాంగణంలోకి మార్చారు. అలాగే కళాశాల భవన నిర్మాణానికి స్థలం కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. పలు సమాలోచనల అనంతరం కాతేరులోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ 21.93 ఎకరాలను లీజుకు ఇచ్చింది. విద్యార్థులకు వ్యవసాయ విద్య బోధించేందుకు, వ్యవసాయ క్షేత్రం ఏర్పాటుకు వడిశలేరులోని భజేనారాయణస్వామి దేవస్థానానికి చెందిన 58.13 ఎకరాల భూమి 50 ఏళ్ల లీజుకు లభించింది. వ్యవసాయ కళాశాల నిర్మాణానికి రూ.24 కోట్లు మంజూరుకావడంతో కాతేరులో నూతన ప్రాంగణం నిర్మించారు. దీన్ని బుధవారం వ్యవసాయశాఖ మంత్రి గోవర్ధనరెడ్డి ప్రారంభించనున్నారు.

ఏటా విద్యార్థుల పెరుగుదల

రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాలలో విద్యాబోధనకు మంచి పేరు రావడంతో విద్యార్థుల సంఖ్య ఏటా పెరుగుతూ వచ్చింది. విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్ ప్రవేశ పరీక్షల్లో విజయం సాధిస్తూ, ఇప్పటి వరకు 19 మంది జేఆర్ఎఫ్ (జూనియర్ రీసర్చ్ ఫిలోషిప్స్), 48 మంది నాన్ జేఆర్ఎస్‌లతో దేశంలోని వివిధ వ్యవసాయ కళాశాలల్లో ప్రవేశం సాధించారు. మరికొంతమంది విద్యార్థులు అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ప్రవేశం సాధించారు. యూనివర్సిటీ స్థాయి అంతర కళాశాలల సాంస్కృతిక, ఆటల పోటీల్లోనూ ప్రతిభ చూపుతూ అనేక బహుమతులను సాధిస్తున్నారు. ఇప్పటివరకూ 533 మంది అగ్రికల్చరల్ బీఎస్సీ పూర్తిచేసుకున్న విద్యార్థులు వ్యవసాయ విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళ్లారు.

రైతులకు సదస్సులు, పశు వైద్యశిబిరాలు

కళాశాలలో నాలుగు సంవత్సరాల చదువు పూర్తయిన విద్యార్థులకు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో పరిస్థితులను అవగాహన చేసుకోవడం, వారి సమస్యలను గుర్తించడం కోసం వారిని ఏరువాక, కృషి విజ్ఞాన కేంద్రాలకు అనుబంధంగా గ్రామ ప్రాంతాలకు తీసుకువెళుతున్నారు.

నాలుగు ఆర్వోబీలు మంజూరు

- ఎంపీ భరత్‌రామ్
- న్యూఢిల్లీలో రైల్వేబోర్డు సీఈఓతో భేటీ



అనిల్ కుమార్ లాహోటీ నుంచి మంజూరు పత్రాలు అందుకుంటున్న ఎంపీ భరత్ రామ్

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో నాలుగు రైల్వే ఎల్‌సీ గేట్ల వద్ద ఆర్వోబీలు మంజూరయ్యాయని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. న్యూఢిల్లీలో రైల్వేబోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) అనిల్ కుమార్ లాహోటీని మంగళవారం కలిశారు. అనంతరం రాజమహేంద్రవరం విలేకరులకు ఆ వివరాలు తెలిపారు. రాజమహేంద్రవరం, అనపర్తి, నిడదవోలు, చాగల్లు ప్రాంతాల్లో రైల్వే ఎల్‌సీ గేట్ల వద్ద ఆర్వోబీలను రూ.239.5 కోట్లతో నిర్మించేందుకు రైల్వేశాఖ మంత్రికి గతంలో తానిచ్చిన విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించి, వీటిని మంజూరు చేసినట్టు రైల్వేబోర్డు చైర్మన్ అనిల్ కుమార్ లాహోటి తెలిపారన్నారు. గోల్డెన్ క్వాడ్రిలేటరల్ /డయాగ్నల్ రూట్స్ (జీక్యూజీడీ) కింద ఇవి మంజూరయ్యాయన్నారు. వీటిలో నిడదవోలు – చాగల్లు రైల్వే స్టేషన్ల మధ్య గల రైల్వే ఎల్‌సీ గేటు వద్ద రూ.54.77 కోట్లు, రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మ పేటలో రూ.74.23 కోట్లు, చాగల్లు యార్డ్ వద్ద రూ.54.98 కోట్లు, అనపర్తి–బిక్కవోలు రైల్వే స్టేషన్ల మధ్య రూ.55.52 కోట్లతో ఆర్వోబీ నిర్మించేందుకు సాంకేతికపరమైన అనుమతి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. వీటి నిర్మాణ వ్యయం పూర్తిగా రైల్వే శాఖే భరిస్తుందన్నారు.

క్లుప్తంగా

పెంటాథ్లాన్ టెట్రాటిల్ పోటీలలో రజతం


పతకం సాధించిన దీప్తి సునయన

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): తిరుపతిలో ఈ నెల 8, 9 తేదీలలో జరిగిన రాష్ట్ర స్థాయి పెంటాథ్లాన్ టెట్రాటిల్ చాంపియన్‌షిప్ పోటీలలో సీనియర్స్ విభాగంలో కాకినాడకు చెందిన దీప్తి ప్రతిభ కనబరిచింది. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన దీప్తి సునయన పెంటాథ్లాన్ టెట్రాటిల్‌లో రజత పతకం సాధించింది. జూన్ 2న గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. సునయన తండ్రి శివప్రసాద్‌వర్మ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, తల్లి ప్రైవేట్ స్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల పదో తరగతి ఫలితాల్లో కూడా సునయన ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయింది. స్విమ్మింగ్‌లో కూడా అండర్‌–17 విభాగంలో రజతం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది.

జేఎన్‌టీయూకేను సందర్శించిన న్యాక్ బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): న్యాక్ అత్యుత్తమ గ్రేడ్ కోసం జేఎన్‌టీయూకే వర్సిటీ దరఖాస్తు చేసుకోగా తనిఖీ నిమిత్తం వివిధ రాష్ట్రాలకు చెందిన ఆరుగురు సభ్యులతో కూడిన నేషనల్ అసెస్‌మెంట్ కౌన్సిల్ (న్యాక్) బృందం మంగళవారం వర్సిటీని సందర్శించింది. మూడు రోజుల పర్యటనలలో భాగంగా తొలిరోజు వర్సిటీ ఆవరణలో ఉన్న తరగతి గదులు, ల్యాబ్‌లు, స్పోర్ట్స్ స్టేడియం, క్రీడా మైదానాలు, స్టూడెంట్ ఎమినిటీ భవనంలో ఉన్న క్యాంటీన్, యోగా సెంటర్, డిస్పెన్సరీలను సందర్శించి అక్కడ అందిస్తున్న సేవలను పరిశీలించింది. బృందం వెంట కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్ పాల్గొని వారి సందేహాలు నివృత్తి చేశారు.


పది తర్వాత ఏం చదవాలి?

- సరైన నిర్ణయం తీసుకోవడం ముఖ్యం
- అవగాహనతో భవిష్యత్తు బంగారం

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్రంలో పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఈ ఏడాది 72 శాతానికి పైగా ఉత్తీర్ణత సాధించారు. టెన్త్ తర్వాత ఏం చేయాలి.. ఏ కోర్సు తీసుకోవాలి.. ఉపాధి అవకాశాలు మెండుగా ఉండే కోర్సులు ఏవి...అనే సందిగ్ధంలో అటు విద్యార్థులు, ఇటు తల్లిదండ్రులు ఉంటారు. పది తరువాత ఇంటర్ చేసే విద్యార్థులు కొందరయితే...ఉపాధి కోసం ప్రయత్నించే కొందరు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటే భవిష్యత్తు బంగారమవుతుంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సరైన కోర్సుల్ని ఎంచుకుంటేనే కెరీర్ కూడా హ్యాపీగా సాగిపోతుంది.

సత్తా చాటిన విద్యార్థులు

కాకినాడ జిల్లాలో 27,358 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో బాలురు 13,600, బాలికలు 13,758 మంది. 8,797 మంది బాలురు ఉత్తీర్ణత సాధించగా, 9,811 మంది బాలికలు పాసయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మెరుగైన ఫలితాలు సాధించడంలో పలు పాఠశాలలు సఫలీకృతమై ఆదర్శంగా నిలిచాయి. మునుపెన్నడూ చూడని రీతిలో ఈసారి 95శాతం పైబడి ఫలితాలు సాధించి రికార్డులను తిరగరాశాయి. ముమ్మిడివరం ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు 71 మంది, అమలాపురం, సమనస బాలుర బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు 58 మంది, కుందూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 30 మంది అత్యధికంగా ఫస్ట్ క్లాస్‌లు సాధించారు. తూర్పుగోదావరి జిల్లాలో 348 ఉన్నత పాఠశాలల్లో రెండు పాఠశాలలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఏపీ రెసిడెన్షియల్ హైస్కూలు భూపాలపట్నంలో 72 మంది పరీక్షలు రాస్తే నూటికి నూరుశాతం ఉత్తీర్ణులవ్వడం విశేషం. వీరిలో చాలామంది టెన్త్ తర్వాత ఏ కోర్సులు ఎంచుకోవాలి? కెరీర్ ఎలా తీర్చిదిద్దుకోవాలన్న డైలామాలో ఉంటారు. వారి కోసమే ఈ వివరాలు..



ఆర్ట్స్ గ్రూప్

సైన్స్, కామర్స్ తర్వాత విద్యార్థులు మక్కువ చూపేది ఆర్ట్స్ గ్రూప్. ఈ గ్రూప్‌లో సైకాలజీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, ఫిలాసఫీ, లిటరేచర్, సోషియాలజీ లాంటి సబ్జెక్ట్స్ ఉంటాయి. ఇవే కాకుండా జర్నలిజమ్, లిటరేచర్, సోషల్ వర్క్, టీచింగ్ ఫీల్డ్స్‌లో కెరీర్ తీర్చుదిద్దుకోవచ్చు. ఇంగ్లిష్, తెలుగు, హిందీ, సంస్కృతం, ఫ్రెంచ్, అరబిక్ లాంగ్వేజెస్ కోర్సులనూ విద్యార్థులు ఎంచుకోవచ్చు.

సైన్స్ దిశగా సాగాలంటే..

ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, మ్యాథ్స్ సబ్జెక్టుతో కోర్సులు చేయొచ్చు. ఇంటర్‌లో ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ లాంటివి ఉంటాయి. ఇంజినీరింగ్, వైద్యరంగం వైపు వెళ్లాలనుకునే వారు ఎంసెట్, జేఈఈ, బిట్‌శాట్, నీట్ పరీక్షల ద్వారా ఇంజినీరింగ్, మెడికల్ కళాశాల్లో సీట్లు పొందవచ్చు. మ్యాథ్స్, సైన్స్ ఇష్టమైతేనే ఈ కోర్సులు ఎంచుకోవాలి.

సైన్స్‌లో ప్రధాన సబ్జెక్టులు

ఎంపీసీ– మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ
బైపీసీ– బయాలజీ (బాటనీ, జువాలజీ),ఫిజిక్స్, కెమిస్ట్రీ

ఉపాధి ఇచ్చే చదువులు

పదో తరగతి తర్వాత ఉపాధి అవకాశాలు త్వరగా సొంతం చేసుకోవాలి అంటే డిప్లమా, వొకేషనల్, సర్టిఫికెట్ కోర్సులు ఉంటాయి. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ప్లంబర్, ఫిట్టర్, మెకానిక్, టెక్నీషియన్ కోర్సులు చదవవచ్చు. పాలిటెక్నిక్ ద్వారా టెక్నికల్ కోర్సులు చేయొచ్చు.

టెక్నికల్ కోర్సుల వివరాలు

డిప్లమా ఇన్ సివిల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, గార్మెంట్ టెక్నాలజీ, హోమ్ సైన్స్, అగ్రికల్చర్, టూరిజం అండ్ ట్రావెల్ టెక్నిక్స్, ప్రీ స్కూల్ ట్రైనింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

కామర్స్ వైపు వెళ్లాలంటే..

కొందరు విద్యార్థులు మ్యాథ్స్, సైన్స్ కంటే కామర్స్‌పై మక్కువ చూపుతారు. ఆలా ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఇంటర్‌లో సీఈసీ కోర్సులు చేయాలి. చార్టర్డ్ అకౌంటెంట్స్, కంపెనీ సెక్రటరీస్, అకౌంటెంట్స్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకింగ్స్, ఫైనాన్షియల్ అడ్వైజర్స్ లాంటి కెరీర్ కోసం కామర్స్ కోర్సుల్ని ఎంచుకునే అవకాశం ఉంది. కామర్స్‌లో బిజినెస్ ఎకనామిక్స్, అకౌంటెన్సీ, బిజినెస్ స్టడీ, బిజినెస్ లా లాంటి సబ్జెక్ట్స్ ఉంటాయి. కామర్స్ ఇష్టమైతే ఈ కోర్సులు ఎంచుకోవచ్చు.

కామర్స్‌లో ప్రధానంగా ఉండే సబ్జెక్టులు

సీఈసీ– సివిక్స్, ఎకనమిక్స్, కామర్స్
హెచ్‌ఈసీ–హిస్టరీ, ఎకనమిక్స్, సివిక్స్, లేదా కామర్స్
ఎంఈసీ–మ్యాథ్స్, ఎకనమిక్స్, కామర్స్

తల్లిదండ్రులు తమ పిల్లల ఆసక్తి, అభిరుచికి తగిన కోర్సులను ఎంపిక చేస్తే ఒత్తిడి లేని విద్యను కొనసాగించి వారి కెరీర్‌ను తీర్చిదిద్దుకోగలుగుతారు. అలాకాకుండా తల్లిదండ్రుల అభిరుచికి తగిన కోర్సులను బలవంతంగా ఎంపిక చేస్తే పిల్లలు ఆయా కోర్సుల్లో రాణించలేక ఒత్తిడికి లోనయ్యి మానసిక రోగాల బారిన పడే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక ఆత్మహత్య


రాజు మృతదేహం

సీతానగరం: అప్పుల బాధ తాళలేక మండలంలోని చినకొండేపూడికి చెందిన కొల్లి రాజు (32) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొవ్వూరు మండలం పెనకలమెట్టకు చెందిన ధీనతో పొక్లెయిన్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజుకు పదేళ్ల క్రితం వివాహం అయింది. ముగ్గురు పిల్లలు పుట్టి మరణించగా, ఏడాదిన్నర కుమారుడు రాజు వద్ద ఉన్నాడు. రాజు ఫిబ్రవరిలో తన భార్యను అప్పులు చేసి ఖత్తర్ పంపించాడు. కొన్ని రోజులుగా అతని భార్య తరచు ఫోన్ చేస్తూ, ఇక్కడ వేధింపులు భరించలేకపోతున్నానని, తిరిగి వచ్చేస్తానని చెబుతోంది. తమ చెల్లిని బలవంతంగా ఖత్తర్ పంపించావని, తక్షణమే వెనక్కి తీసుకురావాలంటూ రాజు బావమరుదులు అయిదుగురు ఒత్తిడి చేస్తున్నారు. వారం రోజుల క్రితం మృతుడు రాజు తన పెద్దనాన్న కుమారుడు ఏసు వద్ద తన బాధను వెల్లడించాడు. అప్పులు తీర్చే దారి కనిపించడం లేదని, బావమరుదుల ఒత్తిడి తట్టుకోలేకపోతున్నానని, ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తోందని చెప్పాడు. ఈ నేపథ్యంలో ఇంటి దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువులు చూసి, మృతదేహాన్ని కిందకు దించారు. పోలీసులు మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు మరణించగా వివాహం అయిన చెల్లెలు ఉంది. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు తెలిపారు.

ఫ్లిప్‌కార్ట్ లోకల్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదం

సుమారు రూ. 25 లక్షల ఆస్తి నష్టం


కాలిపోయిన ఫ్లిప్‌కార్ట్ స్టోరేజ్ పాయింట్ లోపలి భాగం

రాజానగరం: తూర్పుగోదావరి జిల్లా, రాజానగరంలోని ఫ్లిప్‌కార్ట్ లోకల్ స్టోరేజ్ పాయింట్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. భవనంతోపాటు సుమారు రూ.25 లక్షల ఆస్తి నష్టం జరిగివుంటుందని అంచనా. స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. రాజానగరంలో నూకాలమ్మ గుడి వద్ద ఉన్న ఒక భవంతిలో గ్రౌండ్ ఫ్లోర్‌ని అద్దెకు తీసుకుని లోకల్ స్టోరేజ్ పాయింట్ నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసిన పార్శిల్స్‌ని రాజానగరం పరిసరాలలోని లబ్ధిదారులకు సకాలంలో అందించేలా సంస్థ ఈ పాయింట్‌ని ఏర్పాటుచేసి, అందుకు అవసరమైన సిబ్బందిని కూడా నియమించింది. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి లారీలో వచ్చిన పార్సిల్స్‌ని స్టోరేజ్ పాయింట్‌లో భద్రపరచి, సిబ్బంది ఇళ్లకు వెళ్లిపోయారు. వచ్చిన పార్సిల్స్‌ని బట్వాడాకు వీలుగా గ్రామాల వారీగా విభజించేందుకు తెల్లవారుజామున నాలుగు గంటల ప్రాంతంలో అక్కడకు వచ్చిన సిబ్బందిలో ఒకరైన గొంతిన సాయి స్టోరేజ్ పాయింట్ లోపలి నుంచి పొగలు రావడం చూసి, కేకలు వేశాడు. పైన నివాసం ఉంటున్న భవనం యజమానులతోపాటు పరిసరాల వారు కూడా అక్కడికి చేరుకున్నారు. మంటల వేడికి కాలిపోతున్న షట్టర్లు జాగ్రత్తగా ఓపెన్ చేసి చూస్తే లోపల భద్రపరచిన పార్శిల్స్‌తోపాటు కంప్యూటర్లు, రికార్డులన్నీ కాలిపోయాయి. ఆ మంటలు పై అంతస్తును కూడా తాకే సమయంలో విషయం తెలుసుకున్న అగ్నిమాపక దళం రాజమహేంద్రవరం నుంచి చేరుకుని, మంటలను ఆర్పి వేసింది. అయితే అప్పటికే జరగవలసిన నష్టం జరిగిపోయిందని గొంతిన సాయి స్థానిక పోలీసులకిచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టుగా భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ కాశీవిశ్వనాథ్ తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన మత్స్యకారులు..
- ఆసుపత్రికి తరలించిన పోలీసులు


గోదావరిలో దూకి శ్రీకాంత్‌ను రక్షించి ఒడ్డుకు చేర్చిన పోలీసులు, మత్స్యకారులు

యానాం: స్థానిక యానాం–ఎదుర్లంక బాలయోగి వారధి నుంచి గోదావరిలో దూకి సోమవారం అర్ధరాత్రి ఇంజినీరింగ్ చదివిన యువకుడు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. మత్స్యకారులు, పోలీసులు సకాలంలో స్పందించి అతనిని రక్షించారు. పోలీసుల కథనం ప్రకారం విజయవాడకు చెందిన ఇందుకుర్తి శ్రీకాంత్ ఆర్థిక పరమైన సమస్యలతో కలత చెంది బాలయోగి వారధి రెండవ పిల్లర్ భాగం నుంచి గోదావరిలో దూకాడు. ఆ సమయంలో రాజీవ్ బీచ్ ప్రాంతంలో బోట్లు రిపేరు చేసుకుంటున్న పెమ్మాడి భైరవస్వామి మరో ఇద్దరు కలిసి ఈదుకుంటూ వెళ్లి ఇందుకుర్తి శ్రీకాంత్‌ను రక్షించి ఒడ్డుకు తీసుకువచ్చారు. స్థానిక టూరిస్ట్ పోలీస్ అవుట్‌పోస్టు సిబ్బంది, బీట్ పోలీసు సిబ్బంది వచ్చి అపస్మారక స్థితిలో ఉన్న శ్రీకాంత్‌కు ప్రాథమిక చికిత్స అందించారు. మద్యం తాగి ఉన్న శ్రీకాంత్ మొదట్లో వివరాలు తెలపలేకపోయాడు. అనంతరం తన కుటుంబానికి సంబంధించిన వివరాలను తెలిపారు. అక్కడ నుంచి హుటాహుటిన యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన చికిత్సకు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. శ్రీకాంత్ ఆరోగ్యపరిస్థితి మెరుగైందని ప్రాణహాని లేదని వైద్యులు తెలిపారు. శ్రీకాంత్ ఇంజినీరింగ్ పూర్తిచేసి ఉద్యోగ అన్వేషణలో ఉన్నాడు. ఇటీవల అతను వ్యక్తిగత రుణాన్ని తీసుకున్నాడు. తండ్రి సుబ్బరాజు అప్పు ఎందుకు తీసుకున్నావని ప్రశ్నించడంతో విజయవాడ నుంచి పరారై యానాం చేరుకుని నాలుగు బీర్లు తాగి అనంతరం ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. హెడ్‌కానిస్టేబుల్ అప్పారావు, పోలీసులు కోన సుబ్రహ్మణ్యం, బీట్ కానిస్టేబుల్ హరీష్, హోమ్‌గార్డు జానకి తదితరులు శ్రీకాంత్‌ను రక్షించారు.

విజయవాడలో అదృశ్యం కేసు నమోదు

విజయవాడలో బుద్ధంరాజుగారి వీధి, రామకృష్ణాపురానికి చెందిన ఇందుకూరి శ్రీకాంత్‌పై ఈ నెల 8న అదృశ్యం కేసు నమోదయ్యిందని ఎస్సై శేరు నూకరాజు తెలిపారు.

ఆత్రేయపురంలో మహిళ హత్య

ఆత్రేయపురం: మండల కేంద్రం ఆత్రేయపురం చిన్న హరిజనపేటకు చెందిన ఒక మహిళ హత్యకు గురైనట్లు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. భర్తతో వేరుపడిన నక్కా మహాలక్ష్మి (55) కుమారుడు, ఇద్దరు అమ్మాయిలతో చినహరిజనపేటలో నివాసం ఉంటోంది. మంగళవారం సాయంత్రం ఆమె హత్యకు గురైనట్లు గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని రావులపాలెం సీఐ రజనీ కుమార్ పరిశీలించారు. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.


హత్యకు గురైన మహిళ

వైఎస్సార్ సీపీ నేత భవానీశంకర్ హత్య

- పాత కక్షలే కారణమంటున్న పోలీసులు
- నిందితుడి అరెస్ట్


భవానీశంకర్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం


బూరాడ భవానీశంకర్ (ఫైల్)

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం సంజీవ్‌నగర్‌లో పాతకక్షల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీశంకర్(58) మంగళవారం హత్యకు గురయ్యారు. ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్ కథనం ప్రకారం.. సీటీఆర్ఐ పనస చెట్టు సమీపంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన బూరాడ భవానీశంకర్, అతని భార్య కృష్ణ మాధురి ఒక వేడుకకు హాజరై తిరిగి 3.30 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చారు. భవానీశంకర్ మేడపైన హాలులో కూర్చుని భోజనం చేస్తుండగా అదే ప్రాంతానికి చెందిన పీటా అజయ్ అక్కడకు వచ్చాడు. ఏదో మాట్లాడే పని ఉందని చెప్పాడు. సరే భోజనం చేసి కిందకు వస్తానని అతనితో చెప్పాడు. ఇంతలో భవానీశంకర్ భోజనం చేస్తుండగా అజయ్ పైకి వచ్చాడు. ఆ సమయంలో అజయ్ తన వెనుక దాచుకుని ఉన్న కత్తిని చూసి భవానీశంకర్ భార్య గట్టిగా కేకలు వేశారు. ఈ లోపు తనతో వెంట తెచ్చుకున్న కత్తిని తీసి కడుపులో మూడుసార్లు పొడిచి, పరారు అయ్యాడు. గాయాలపాలైన భవానీశంకర్‌ను వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతి చెందారు. విషయం తెలిసిన ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. హత్య జరిగిన వివరాలను కుటుంబ సభ్యులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అయితే ఈ హత్య పాత కక్షల నేపథ్యంలో జరిగి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. హత్యకు గురైన భవానీశంకర్ వైఎస్సార్ సీపీ 44 వార్డు ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. హత్యకు ఉపయోగించిన కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజ్ సేకరించిన పోలీసులు హత్య చేసింది అజయ్‌గా గుర్తించి అతనిని అరెస్టు చేశారు. మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఢిల్లీలో ఉన్న ఎంపీ భరత్‌రామ్ మృతుడి భార్య కృష్ణమాధురిని ఫోన్‌లో పరామర్శించారు.

మనస్థాపంతో ఆత్మహత్యాయత్నం

ఏలేశ్వరం: పట్టణాభివృద్ధిలో భాగంగా దుకాణాల తొలగింపులో తన షాపు పోతుందని మనస్థాపం చెందిన వ్యక్తి పట్టణంలో మంగళవారం ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పట్టణానికి చెందిన దత్తిరాజా స్థానిక నగర పంచాయతీలో ఔట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్నాడు. ఇతనికి బాలాజీచౌక్ వద్ద షాపు ఉంది. పట్టణంలోని నాలుగు ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం చేపట్టి ఆక్రమణలు తొలగిస్తున్నారు. ఈ నేపథ్యంలో తన షాపు పోతుందని రాజా మనస్థాపం చెంది ఆలౌట్ లిక్విడ్ తాగాడు. దీంతో ప్రత్తిపాడులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

విద్యుదాఘాతానికి భవన నిర్మాణ కార్మికుడి మృతి


మృతుడు అంబేద్కర్

అమలాపురం టౌన్: స్థానిక రావులచెరువులో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు పెయ్యల అంబేద్కర్ (36) విద్యుదాఘాతానికి గురై మంగళవారం మృతి చెందాడు. అల్లవరం మండలం గూడాలకు చెందిన అంబేద్కర్ విద్యుత్ మోటారుకు వైర్‌తో ఉన్న ప్లగ్‌ను స్విచ్ బోర్డులో పెడుతుండగా విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు వదిలాడు. తోటి కార్మికులు, ఇంటి యాజమాని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంబేద్కర్‌కు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. నా కుటుంబానికి దిక్కెవరు... ఎదిగి వస్తున్న ఇద్దరి ఆడపిల్లలను ఎలా పెంచాలంటూ భార్య విలపిస్తోంది. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై ప్రభాకరావు తెలిపారు.

శివాలయంలో చోరీ

రూ.5 లక్షల విలువైన ఆభరణాల అపహరణ


స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ కిషోర్‌బాబు

ఏలేశ్వరం: సిరిపురం గ్రామంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని సుమారు రూ.5లక్షల విలువ చేసే బంగారు, వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. శివాలయంలో అర్ధరాత్రి దాటాక దుండుగులు తలుపుల తాళాలు బద్దలకొట్టి గర్భగుడిలోని ఆభరణాలు దొంగిలించారు. ఆలయంలోని బంగారు కళ్లు, ముక్కుపుడక, వెండి ధారాపాత్ర, కిరీటం, హస్తం, వడ్డాణాం, కాసుల పేరు చోరీకి గురైనట్టు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ తిబిరిశెట్టి ఆదినారాయణ ఫిర్యాదు మేరకు సీఐ కిషోర్‌బాబు, ఎస్సై జి.సతీష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఆలయ ఈఓ టి.సూర్యనారాయణ, స్థానికులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ద్వారా పరిసరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్


పెరవలి పోలీస్ స్టేషన్‌లో వివరాలు తెలుపుతున్న సీఐ వెంకటేశ్వరరావు


భార్య, కుమార్తెతో సురేంద్ర (ఫైల్)

పెరవలి: సెల్‌ఫోన్‌కు ఈఎంఐ కట్టే విషయంలో తలెత్తిన వివాదంలో స్నేహితుడిని హత్య చేసి మృతదేహాన్ని తన ఇంటిలోనే పూడ్చి పెట్టిన కేసులో లాకవరపు పవన్‌కుమార్‌ను అరెస్ట్ చేసినట్టు సీఐ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. పెరవలి మండలం నడుపల్లికోట గ్రామానికి చెందిన మృతుడు కొడమంచిలి సురేంద్ర (25), లాకవరపు పవన్‌కుమార్ స్నేహితులు. సురేంద్ర స్నేహితుడికి ఈఎంఐలో సెల్‌ఫోన్ ఇప్పించాడు. రెండు వాయిదాలు కట్టిన తర్వాత సొమ్ము కట్టడం మానేశాడు. సురేంద్ర ఈ నెల 3వ తేదీన పవన్‌కుమార్ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరగటంతో ఇనుపరాడ్డుతో తలపై బలంగా కొట్టడంతో సురేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. ఇంటిలోనే గొయ్యితీసి మృతదేహాన్ని పూడ్చిపెట్టాడు. మూడు రోజులకు దుర్వాసన రావటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా 6వ తేదీన పోలీసులు, తహసీల్దార్ సమక్షంలో తవ్వకాలు జరిపి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సురేంద్ర మృతికి కారణమైన పవన్‌కుమార్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు. వేగంగా కేసు దర్యాప్తు చేసిన ఎస్ఐ ఎం.సూర్య భగవాన్‌ను, సిబ్బందిని సీఐ వెంకటేశ్వరరావు అభినందించారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనం సీజ్


ప్రక్కిలంక వద్ద స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

తాళ్లపూడి: ఖమ్మం నుంచి కాకినాడ పోర్టుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రక్కిలంక వద్ద అధికారులు పట్టుకున్నారు. తాళ్లపూడి ఎస్సై కె.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ప్రక్కిలంక మీదుగా ఒక వ్యాన్‌లో రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నట్టు మండల సివిల్ సప్లయిస్ డీటీ సునీతకు సమాచారం రావడంతో పోలీసుల సహకారంతో వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం బయటపడినట్టు తెలిపారు. రూ.1,80,000 విలువ గల 50 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశామని ఎస్సై తెలిపారు. రేషన్ బియ్యాన్ని గోపాలపురం డిపోకు తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేశామన్నారు.